ఇష్టపడి చదివితే లక్ష్య సాధన సులభం

- **జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖారెడ్డి**

మరికల్, సెప్టెంబర్ 30: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే లక్ష్యం సాధించడం సులభమని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మణికంఠ కళాశాల ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డుతూ విద్యార్థులకు ఇంటర్ దశ కీలకమన్నారు. ఇంటర్‌లో పట్టుదలతో చదివితే ఉన్నత చదువులు సులభమవుతాయ న్నారు. విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం గతేడాది ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవికుమార్, సర్పంచ్ కస్సె గోవర్ధన్, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు రాజేశ్, మండల అధ్యక్షులు తిరుపతయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు కృష్ణారెడ్డి, హన్మిరెడ్డి, అధ్యాపకులు ఆనంద్, శ్రీకాంత్‌రెడ్డి, తఖీ, రాములు,తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

ధన్వాడ, సెప్టెంబర్ 30 : కళాశాలకు క్రమం తప్పకుండా వచ్చి అధ్యాపకులు చెప్పే పాఠాలు శ్రద్ధగావిని వంద శాతం ఫలితాలు సాధించాలని ధన్వాడ ప్రభుత్వ జునియార్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ముజీబ్ విద్యార్థులకు సూచించారు. శనివారం కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లు విడిచి పెట్టి ఉన్నత ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో చదివితే రాణిస్తారని అన్నారు. చదువుతో పాటు సంస్కారం కూడా ముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వరనివాస్, సాంబశివుడు, స్వర్ణలక్ష్మి, నర్సయ్య, మేరీ, రామకృష్ణ, శివయ్య, మల్లేశ్, వెంకటలక్ష్మి, అరవింద్ పాల్గొన్నారు.

టీ పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

ధన్వాడ, సెప్టెంబర్ 30: టీ పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీపీఆర్టీయూ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం తర్వలోనే ఉద్యోగులకు ఐఆర్, పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీ పీఆర్టీయూ నాయకులు శెట్టి రమేశ్, లక్ష్మారెడ్డి, రవికుమార్, వెంకటయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

దామరగిద్ద, సెప్టెంబర్ 30: వరంగల్ స్పోర్ట్ పాఠశాలకు ఎంపికైన మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి చెన్న కేశవులును శనివారం ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధా నోపాధ్యాయుడు కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలన్నారు. చెన్నకేశవులను ఆదర్శంగా తీసుకొని మిగితా విద్యా ర్థులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేందర్‌శెట్టి, గిరిజకుమారి, భాగ్యమ్మ, విజయలక్ష్మి, విద్యార్థి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు అభినందనలు

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 30: కొత్తకోటలో ఈనెల 25, 26, 27 తేదీలో మైనార్టీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రీడా పోటీల్లో నారాయణపేట మైనార్టీ గురుకుల విద్యార్థులు వాలీబాల్, ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. శనివారం వారిని ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్‌ఖాన్, జిల్లా విద్య సమన్వయకర్త సలీం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఖాసీం హుస్సేన్, అబ్దుల్ సలీం, నారాయణ, పంకజ్‌ధీర్, శివకుమార్, ఖదీర్, ఫయాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని తరిమికొడదాం

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), సెప్టెంబర్ 30 : గ్రామాల్లోని ప్రజలందరూ కలిసి మెలసి ఉండి అంటరానితనాన్ని తరిమేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తాసీల్దార్ ఎల్లన్న పిలుపునిచ్చారు. శనివారం కౌకుంట్ల మండలం దాసర్‌పల్లిలో తాసీల్దార్ గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ జమీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నవాబ్‌పేట, సెప్టెంబర్ 30 : మండలంలోని కూచూర్ గ్రామానికి చెందిన జోగు కృష్ణయ్య(45) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. జోగు కృష్ణయ్య భార్య మూడు సంవత్సరాల కిందట అనారోగ్యంతో మృతి చెందగా.. అతడి కూతురు ఏడాది కిందట ప్రేమ వివాహం చేసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఎస్సై తెలిపారు. దీంతో అతడి బాగోగులు చూసుకునే వారు లేక జీవితంపై విరక్తి చెంది శనివారం గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో చింత చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- **ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి**

మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్, సెప్టెంబర్ 30: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు ఆయా శాఖలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి సంబంధిత అధికారులు సభలో చదివి వినిపించారు. మండలంలో 34 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ట్యాబ్‌లు అందజేసినట్లు ఎంఈవో వెంకటయ్య తెలిపారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు వారంలో మూడు రోజులు రాగి జావా అందిస్తున్నామని, అన్ని పాఠశాలల్లో దసరా తర్వాత ఉదయం అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అయిల్ పాం తోటలు పెంచే రైతులకు ఎరువులు, అంతర పంటల కోసం సంవత్సరానికి రూ.4,200 నాలుగేండ్ల పాటు అందిస్తోందని హార్టికల్చర్ అధికారి సమీనాబేగం తెలిపారు. మండలంలో 200 ఎకరాల్లో అయిల్ పాం తోటలు రైతులు సాగు చేశారని అదనంగా 217 ఎకరాల్లో అయిల్ పాం తోటలు పెంచేందుకు డీడీలు చెల్లించినట్లు తెలిపారు. 90 శాతం రాయితీతో కూరగాయలు పెంచే రైతులకు పచ్చిమిరప, వంకాయ, టమాట నారు అందజేస్తున్నట్లు తెలిపారు. ఐకేపీ ఏపీఎం నిర్మల మాట్లాడుతూ మండలంలో 114 మహిళా సంఘాలకు రూ.9.10 కోట్ల రుణాలను అందజేశామన్నారు. స్త్రీనిధి ద్వారా 415 సంఘాలకు రూ. 98 లక్షలు అందజేశామన్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం పీఎంఎఫ్ఎంఈ ద్వారా 12 యూనిట్లను ప్రారంభించినట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ అశోక్‌కుమార్ గౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, సూపరింటెండెంట్ కొండన్న, సర్పంచులు సూర్యప్రకాశ్ రెడ్డి, సుమంగళ, మాణిక్యమ్మ, యశోదమ్మ, సరోజ, సులోచన, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన ఉండాలి

- **డీఎంహెచ్‌వో శైలజ**

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శైలజ

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 30: అసంక్రమిత వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో శైలజ అన్నారు. శనివారం పట్టణంలోని నైపుణ్య శిక్షణాభివృద్ధి కేంద్రంలో జిల్లాలోని వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లలు, స్టాఫ్ నర్సు లు, పార్మాసిస్టులు, ఎంపీహెచ్‌ఏలకు అసంక్రమిత వ్యా ధులు (ఎంపీఎన్‌సీడీ), నూతన ఆన్‌లైన్ పోర్టల్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, త్వరగా వ్యాధి గ్రస్తులను గుర్తించి చికిత్స అందిచాలన్నారు. ప్రతినెలా వ్యాధిగ్రస్తులను గమనించాలన్నారు. ఎన్‌సీడీ పీవో సౌభాగ్యలక్ష్మీ మాట్లాడుతూ 30 ఏండ్లు పైబడిన వారిలో ముఖ్యంగా బీపీ, మధుమేహం, క్యాన్సర్ వ్యాధులను గుర్తించి చికిత్సలు అందే లా చూడాలన్నారు. ఎన్‌పీఎన్‌సీడీ స్టేట్ నోడల్ ఆఫీసర్ అబ్దుల్ వసీ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల వల్లనే 75శాతం మరణాలు సంభవిస్తున్నాయన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర వ్యాధులు వచ్చినప్పుడే కాకుం డా 30 ఏండ్లు పైబడిన వారందరూ ప్రతి రోజు 30 నిమిషాల పాటు వాకింగ్, యోగా చేయాలన్నారు. ఆహార పదార్థాల్లో ఉప్పు తగ్గించాలని, పాస్ట్ ఫుడ్ తీసుకోరా దన్నారు. ఎన్‌పీ ఎన్‌సీడీ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి నూతన యాప్‌లో నమోదు చేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో డీపీ వో భిక్షపతి, ఎస్‌యూవో అశోక్, హెచ్‌ఈవో గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

మరికల్, సెప్టెంబర్ 30 : మరికల్ వికాస వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ చౌరస్తాలో గల గ్రంథాలయ భవనంలో నిర్వహించనున్న శిబిరంలో సరాల బలహీనత, మెడ, వెన్ను నొప్పి, పక్షవాతం, మతిమరుపు తదితర వ్యాధులకు న్యూరాలజిస్టు జీవీకేఆర్ గౌడ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

మక్తల్ అర్బన్, సెప్టెంబర్ 30: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు అంబాదాస్ శనివారం ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ భవనంలో ఉదయం 9 గంటలకు రాంరెడ్డి కంటి దవాఖాన సౌజన్యంతో లయన్ అనుగొండ శ్రీనివాసులు సహకారంతో కంటి, డయాబెటిక్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరాన్ని మక్తల్ పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచాంచారు.

సైక్లింగ్ పోటీలు

మక్తల్‌టౌన్, సెప్టెంబర్ 30: గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం పాఠశాల విద్యార్థులకు జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కావలి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. శనివారం మక్తల్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ సైక్లింగ్ సంబురాల్లో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి ఆదేశాల మేరకు అక్టోబర్ 2వ తేదీన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈపోటీల్లో 8 ఏండ్ల నుంచి 13 ఏండ్ల బాల బాలికలు పాల్గొన వచ్చన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2వ తేదీ ఉదయం 7గంటల వరకు మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీలో గెలుపొందిన వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు 7702713139 నెంబర్‌ను సంప్రదించాలని సూచిం చారు. సమావేశంలో పీఈటీలు రమేశ్, దామోదర్ పాల్గొన్నారు.

ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్ ప్రకటించాలి

భూత్పూర్, సెప్టెంబర్ 30 : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్ పెంచాలని గిరిజన సంఘం మండలాధ్యక్షుడు రామురాథోడ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్ బిల్లు పాస్ చేస్తూ పార్లమెంట్‌కు పంపారని, పార్లమెంట్‌లో కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో సర్పంచ్ ఆంజనేయులు, గోపాల్‌నాయక్, యాదిరెడ్డి, శంకర్‌నాయక్, తారునాయక్, సత్యం, రవినాయక్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతి కోసం కృషి

- **సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి**

సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

నర్వ, సెప్టెంబర్ 30: రైతుల అభ్యున్నతి కోసం సింగిల్‌విండో సొసైటీ ద్వారా నిరంతరం కృషి చేస్తున్నామని నర్వ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో ద్వారా గత రబీ సీజన్‌లో రైతుల ద్వారా సేకరించిన వరి ధాన్యం రవాణా ఖర్చులు బస్తాకు రూ.8 చొప్పున అన్ని గ్రామాల రైతులకు అందజేశామన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా అవసరం మేర సరఫరా చేస్తున్నామని వివరించారు. రుణాలు తీసుకున్న రైతులు గడువులోగా రెన్యూవల్ చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు చెల్లించి సంఘం బలోపేతానికి సహకారం అందించాలని కోరారు. అనంతరం జమా ఖర్చులు తదితర అంశలపై చర్చించి పలు అంశలపై సభ లో తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మణ్, సభ్యులు శేఖర్, లింగన్న, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణ - కాచిగూడ రైలు ప్రారంభం

కృష్ణ, సెప్టెంబర్ 30 : కృష్ణ మండలం నుంచి కాచిగూడా వరకు నడిచే రైలును ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మాగనూర్ కృష్ణ స్టేషన్ మధ్య విద్యుదీకరణ పనులు పూర్తి కాకపోవడంతో డీజిల్ ఇంజన్ డెమో రైలు ప్రవేశపెడుతున్నట్లు దక్షిణమధ్యరైల్వే ఉన్నత అధికారి తెలిపారు. మండల ప్రజలకు తక్కువ చార్జీలతో రైలు ప్రయాణం అందుబాటులోకి రానుందని, రైలు రాకపోకలకు షెడ్యుల్ త్వరలో విడుదల చేయనున్నట్లు వారు తెపారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కృష్ణ రైల్వే ప్రాంగాణాన్ని శుభ్రం చేశారు.